# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!







### ❖ చిన్న, సన్నకారు రైతుల గతేం గావాలే..

కుభీర్, నవంబర్ 26 : నాకు మూడెకరాల భూమి ఉంది. నా చేను పక్కనే నందకుమార్ చేను కూడా ఉంది. ఆయన బోరు బావి నుంచే నాకు యాసంగి పండే శనగ, మక్క పంటకు సాగు నీరిస్తాడు. ఒక వేళ మూడు గంటలే కరెంటిస్తే ఆయన చేనుకే సరిపోదు. నాకు ఎట్లా నీళ్లిస్తడు. రేవంత్‌రెడ్డి చిన్న, సన్నకారు రైతుల గురించి ఆలోచించి మాట్లాడితే బాగుంటది. రైతులకు 24 గంటలు కేసీఆర్ ప్రభుత్వం ఇస్తుంటే మాలాంటి బోరు మోటరు లేని పేద రైతులు పక్కా చేను వారి నుంచి నీళ్లు పారిచ్చుకుంటున్నం. మీరిచ్చేది మూడు గంటలైతే వారికే సరిపోని నీళ్లు నాకెలా ఇస్తారు. అంటే పేద రైతులు ఏం గావాలే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదు. రేవంత్‌రెడ్డి మాటలతో రైతుల్లో భయం వెంటాడుతోంది.

**- శాహానే గౌతం, పార్డి(కె), రైతు, కుభీర్**

### ❖ 3 గంటలతో సాపెలుపు నీరు పారది..

తానూర్, నవంబర్, 26 : మూడు గంటల కరెంటిస్తే సాపెలుపు పొలం తడువదు. అసలు రైతులు బాగుపడుడు కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ ఇష్టముండదు. ఎనుకటి నుంచే ఇదే తంతు వాళ్లిచ్చే కరెంటుకు తెల్లందాకపొద్దుందాక బోరులకాడికి పోవాలే. పురుగుబూసి కుట్టి చావాలే. రైతులు ఇప్పుడు సుఖంగా బతుకుతున్నారు. వాళ్ల కండ్లు రైతుల మీద పడ్డాయి. రేవంత్‌రెడ్డి అంటోడు మూడడుగుల పొడుగుంటడట ఇటు మూడు గంటల కరెంటంటడు. మరొాదిక్కు 10హెచ్‌పీ మోటరంటడు. ఎవుసం తెల్వని మాటలవి. వాని మూడు గంటల కరెంటొద్దు, 10హెచ్‌పీ మోటరొద్దు. కరెంటు ఉన్నదున్నట్లు ఉండాలంటే మా ఓటు కేసీఆర్‌కే ఏస్తం. కేసీఆర్‌తోని జనం బాగుపడుతున్నరు. కారు గుర్తుకు ఓటేసుడే. కాంగ్రెస్‌ను తరిమికొట్టుడే.. రైతులందరిది ఇదే బాట.

**- పవార్ సురేశ్ రైతు (తానూర్)**



### ❖ ఏ మోటరవాడల్లో వాళ్లకెట్ల తెలుస్తది..

తానూర్, నవంబర్ 26 : 10 హెచ్‌పీ మోటర్లను రైతులు ఎక్కడ వినియోగించడం లేదు. 10 హెచ్‌పీ మోటర్లను వినియోగిస్తే ఎక్కువ విద్యుత్ పాటు కొద్ది సమయంలో బోరు బావుల్లోని నీరంతా యిపోతది. దీని ద్వారా మోటర్లు కాలిపోవడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే అవకాశమున్నది. 3 గానీ, 5 హెచ్‌పీ మోటర్లు రైతులకు సరిపోతయ్. కాంగ్రెస్ నాయకులు ఏనాడైనా వ్యవసాయం చేసి ఉంటే తెలుస్తుండే. ఏ మోటర్లు వాడాలో ఏ మోటర్లు వాడకూడదో. సీఎం కేసీఆర్‌కు వ్యవసాయం తెలుసు కాబట్టే రైతుల పక్షాన నిలబడుతున్నడు. 10 హెచ్‌పీ మోటర్ల వినియోగంతో నష్టాలు తప్ప లాభాలు లేవు. అందుకే 24 గంటల కరెంట్ ఇచ్చే కేసీఆర్ వెంటే ఉంటాం.

**- ఫెరోజ్, దివ్యాంగుడు, తానూర్**

# కాంగ్రెస్ రావద్దు.. ఎవుసం ఆగంగావద్దు..

- ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదు..
- మళ్లా మా బతుకులు నాశనం చేసుకోం..
- రాత్రుళ్లు పొలాలకు పోయే దుస్థితి మాకద్దు
- స్పష్టం చేస్తున్న అన్నదాతలు

**10 హెచ్‌పీ మోటర్ల వల్ల భూమిల నీళ్లన్నీ ఒడుస్తయ్. కరెంట్ బాగా కాల్తది. రైతులకు ఫాయిదా ఉండది. గతంలో మాటిమాటికి బోరు మోటర్లు కాలిపోతుండే. ట్రాన్స్‌ఫార్మర్లు కరాబైతుండేటియి. ప్రతిసారి మోటరు తీయనీకి, దించనీకి మస్తు ఖర్సయ్యేది. పంటలు ఎండిపోయేటివి. తెలంగాణ అచ్చినంకనే కరెంట్ మంచిగిస్తున్నరు. పంటల మంచిగ పండుతున్నయ్. సర్కారు మా రైతులకు ఫ్రీగా కరెంట్ ఇయ్యవట్టే. గిప్పడే అన్నివిధాలా మా రైతులకు మంచిగ ఉన్నది. మళ్లా కాంగ్రెస్ నాయకులు 3గంటల కరెంట్, పది హెచ్‌పీ మోటర్లని మమ్మల్ని ఆగంజేస్తరేంది. కాలం మంచిగైతున్నది. కరెంట్ మంచిగుంటున్నది. మాకు రెండు పంటలు పండుతున్నయ్. రైతులకు, కైకిలోల్లకు కైకిలి దొరుకుతున్నది. గీ కాంగ్రెసోళ్లు అస్తే మళ్లా ఎన్కటి రోజులు తేవాలని జూత్తున్నరు. కాంగ్రెసోళ్లు రావద్దు. మా ఎవుసాన్ని మళ్లా ఆగం జేయద్దు.**

### ❖ కాంగ్రెస్ ఓటు వేయం..



లోకేశ్వరం, నవంబర్ 26 : కాంగ్రెస్‌కు ఓటేస్తే వ్యవసాయం చేయలేం. మళ్లీ వలసలు మొదలవుతాయి. కరెంటు రాదు పంటలు పండవు. పంటల కోసం మళ్లీ అప్పులు చేయాలి. కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడతాయి. కేసీఆర్ దయ వల్ల రైతులందరూ ఆనందంగా ఉన్నారు. కేసీఆర్ వచ్చినాక కరెంటు తిప్పలు లేవు. మరి కాంగ్రెస్‌కు ఓటు వేయం. వారి వేసుడు అవసరమా. రైతులు ఆలోచన చేయాలె.

**- జాదవ్ కిషన్ పటేల్, రైతు(లోకేశ్వరం)**



### ❖ అప్పట్లో కరెంటు కోసం కావలి కాసేటోళ్లం..

తానూర్, నవంబర్ 26 : అప్పటి కరెంటు కష్టాలు మళ్లీ రావద్దు. రాత్రి పూట బోర్లు కాడ పండుకునేటోళ్లం. కరెంటు ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతదో తెల్వదు. దీంతో అక్కడే కావలి కాసేటోళ్లం. రాత్రిపూట ఇచ్చే కరెంటుతో గ్రామంలో చాలా మంది. రైతులు నీళ్లు పెట్టేందుకు పోయి కరెంటు షాక్, పాముల కాటుకు గురై చనిపోయారు. కరెంటు సరిగా రాక పంటలు ఎండిపోయేవి. తెలంగాణలో ఇప్పుడు 24 గంటల కరెంటు వస్తుండడంతో రైతులు అవసరం వచ్చినప్పుడల్లా నీళ్లు పారించుకుంటున్నారు. ఎవుసం సక్కగా ఉంది. రెండు పంటలు పండిస్తూ రైతు రాజుగా జీవిస్తుండు. మంచి పంటలు పండుతున్నాయి. మళ్లీ కాంగ్రెస్ వస్తే రైతులు బోర్ల కాడ పండుకోవాలే. ఈ కష్టం మళ్లీ మాకు వద్దు. కాంగ్రెస్ వచ్చేది లేదు. సచ్చేది లేదు. బీఆర్‌ఎస్ సర్కారే ఉండాలి. సీఎంగా కేసీఆరే ఉండాలి.

**- బోయిన్‌వాడ్ అరుణ్ పెట్రోల్‌బంక్ వర్కర్(తానూర్)**

### ❖ రేవంత్‌రెడ్డి పొలాలకు వచ్చి నీళ్లు పారిస్తే తెలుస్తది..



కుభీర్, నవంబర్ 26 : నేను నా సొంత భూమి, కౌలుకు తీసుకొని పదెకరాల్లో పంటలు పండిస్తా. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని అంటున్న రేవంత్‌రెడ్డి, క్షేత్ర స్థాయిలోకి వచ్చి ఎలా సరిపోతదో చెప్పాలి. 50 ఏండ్లలో కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కనాడు రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇయ్యాల కేసీఆర్ పుణ్యమా అని 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో షావుకార్ల దగ్గరికి వెళ్లి పెట్టుబడులకు అప్పులు చేయడం 90 శాతం బందయ్యింది. ఇది కేసీఆర్ మార్క్. కాంగ్రెస్ వచ్చేది కాదు సచ్చేది కాదు. అది రానే రాదు.

**- నాయుడు శంకర్, రైతు, కుభీర్ మండలం**

### ❖ ఎవుసాన్ని బొందపెడుతరు..



కుభీర్, నవంబర్ 26 : వ్యవసాయంపై అవగాహన లేని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి వచ్చీరాని మాటలు చెబుతున్నాడు. మూడు గంటలు కరెంటిస్తే చాలని చెప్పడం సరైంది కాదు. ఇలా అయితే పంటలకు నీళ్లు పెట్టలేం. 10 హెచ్‌పీ మోటర్లతో నష్టమే తప్ప ఉపయోగం లేదు. ఒక్కో రైతు వ్యవసాయ భూమిలో 300 ఫీట్ల వరకు బోరు బావి ఉంది. 10 హెచ్‌పీ మోటరును ఏర్పాటు చేసుకోవాలంటే పైపులు, వైరు, ఇతర సామానుకు కలిపి 70 వేల ఖర్చు అవుతది. ఇది కూడా కాంగ్రెస్ నాయకులకు తెలియక పోవడం విడ్డూరం. రైతులు కూడా చైతన్య వంతులయ్యారు. మీకు ఓటెయ్యరు. మీరు అధికారంలోకి రారు.. ఇది గ్యారంటీ. మిమ్మల్నెవరు నమ్ముతరు. మీరు ఓడిపోవడం ఖాయం.

**- దుంపెటి శంకర్, రైతు, పార్డి(కె), కుభీర్**



### ❖ మూడో సారి సీఎం కేసీఆరే..

తానూర్, నవంబర్, 26 : తెలంగాణలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటుతో చాలా ప్రాధాన్యత ఉంది. వ్యవసాయ పంటలకు నీటిని అందిస్తూ చక్కగా పండించుకుంటున్నాం. తెలంగాణ రాష్ట్రానికే కాక దేశానికి కూడా అన్నపూర్ణగా ఆవిర్భవించింది. రాత్రి పగలు వెలుగులు నిండుతున్నాయి. నిరంతరం కరెంటు సరఫరాతో సంతోషంగా ఉన్నాం. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలు అనేక మందికి జీవనోపాధిని కల్పిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇవన్నీ పోతాయి. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌కు మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దాం. రైతులందరూ ఇదే ఆలోచనలో ఉన్నారు.

**- పవార్ దత్తు, జేసీబీ డ్రైవర్**